

# పుస్తక పరిచయం




డా.రమణ యశస్వి
ఆచార్యులు ఆర్థో విభాగం
గుంటూరు వైద్య కళాశాల

'కరోనా'..! ప్రకృతిలోని సమస్తాన్నీ జయించేశామని విర్రవీగుతున్న మానవాళికి ఒక గొప్ప గుణపాఠాన్ని నేర్పిన సూక్ష్మక్రిమి. సుమరు గత రెండేళ్ళుగా కరోనా భూగోళాన్ని వణికించిన తీరు, ఇంకా వణికిస్తున్న వైనం మానవజాతి చరిత్రలో ఒక భయంకరమైన అధ్యాయంగా మిగిలిపోతుంది.

కరోనా ప్రభావాన్ని ఎన్నో కోణాల్లో చూడొచ్చు. శాస్త్రవిజ్ఞాన పరంగా– అసలు కరోన అంటే ఏమిటి? ఎలా పుట్టింది? దాని స్వరూప స్వభావాలేమిటి? ఎలా వ్యాప్తి చెందుతుంది, ఎలా రూపాలు మార్చుకుంటుంది.. మొదలైన అంశాలు; వైద్యవిజ్ఞాన పరంగా – దీనికి ఔషధాలేమిటి, ఎలా నియంత్రించాలి, వాక్సినేషన్ ఎలా మొదలైన అంశాలు ; సామాజికంగా – కరోనా సంక్షోభం సృష్టించిన అల్లకల్లోలం, అతలా కుతలమైన మానవ సంబంధాలు, కుప్పకూలిన ఆర్థిక వ్యవస్థలు మొదలైన అంశాలు.. ఇలాంటి అన్నికోణాలనూ కవితాత్మకంగా వర్ణించడం డా.రమణ యశస్విగారు చేసిన వినూత్న ప్రయోగం. కరోనా గురించి చాలామంది చాలా కవితలు వ్రాసినా , డా.రమణగారు వ్రాసిన ఈ ఆత్మ కథాత్మక దీర్ఘకావ్యం అనేక విధాలుగా తన ప్రత్యేకతను నిలబెట్టుకుంటుంది. ముందులో పేర్కొన్న కరోనా ప్రభావ కోణాలన్నింటినీ అత్యంత వివరంగా కవితారూపంలో పొందుపరిచారీ పుస్తకంలో. ఈ దీర్ఘ కావ్య రచనలో డా.రమణగారి కలం స్వైరవిహారం చేసింది. విశ్లేషించిన అంశాలు, వాటి వివరాలు – ఇవన్నీ ఒక ఎత్తు ఐతే , డా.రమణగారు ఎంచుకున్న విభిన్న కవితా ప్రక్రియలు మరొక ఎత్తు – వచన కవిత, గేయం, పాట, పేరడీ, వ్యాసం.. అన్ని ప్రక్రియల్నీ అవలీలగా కరోనా ఆత్మకథగా ఈ దీర్ఘకావ్యంలో పరుగులెత్తించారు. ఇవన్నీ ఒకోసారి మంద్రంగా, ఒకోసారి గంభీరంగా, ఇంకోసారి వేగంగా..సాగుతాయి. భావవ్యక్తీకరణలో కూడా హాస్యం, వ్యంగ్యం, శాంతం, ఆలోచన, వివేచన, విశ్లేషణ.. అన్ని కోణాలనూ స్పృశించారు. కొన్ని మచ్చుతునకలు: – 'కాలం కూడా రెండుగా చీలిపోయింది / కరోనా ముందు/ కరోనా తర్వాతగా/ ఈ యుగ సంధిలో వైతాళికులు, దార్శనికులు. మేధావులు, మాధ్యమాలు/ జనులకు దారిచూపే దివిటీలు కావాలి'; 'సరిహద్దుల వివాదం / హద్దుమీరుతత్వం/ నేనునాది అని మూర్ఖత్వం/ కాదని తెలిసినా ఏదీ శాస్వతం/ అన్నింటిమీదా పెత్తనం'; పంతం కన్నా/ పర్వతం గొప్పది/ బంధం కన్నా/ బాదం చెట్టు గొప్పది / అన్ని గొప్పలనీ/ గొప్పగా చూపించిన/ కరోనా ఆత్మ గొప్పది'; 'కరోనా! కరోనా!!/ మా కసి కోవిడ్ పైన / చకచక చావే చైనా కూనా!'. వృత్తిరీత్యా అర్థోపెడిక్ శస్త్రనిపుణులైన డా.రమణగారు సామాజిక స్పృహే ప్రధానాంశంగా చేస్తున్న కవితాసేద్యం అత్యంత అభినందనీయం..!!



# పుస్తక పరిచయం




For Copies :
**rckrajulic@gmail.com**
**Mobile: 9393662821**

ఈ శీర్షికలో తమ పుస్తక పరిచయాలు ప్రచురింపబడాలనుకునే వారు, తమ పుస్తకాలు ఒక్కొక్క కాపీని క్రింది ఎడ్రసుకి మెయిల్ చెయ్యవలసిందిగా 'కౌముది' విజ్ఞప్తి చేస్తోంది.
**Editor,**
**KOUMUDI (Web Monthly)**
**4251 - Escudo Ct**
**Dublin - CA 94568, USA**

1980లలో, పత్రికల్లో పాఠకులు పాల్గొనే శీర్షికలు పెరుగుతున్న కాలంలో, మొదలైన ఓ ప్రక్రియ కార్డుకథలు. పోస్టుకార్డు మీద మాత్రమే కథవ్రాసి పంపమని కొన్ని పత్రికలు ప్రకటిస్తూ ఉండేవి. కథను పది పదిహేను పేజీల్లో వ్రాయడం ఒక విధానమైతే, కేవలం పోస్ట్‌కార్డ్ నిడివిలోనే కథ చెప్పడం ఒక విధంగా సవాలే..! అలాంటిది ఆర్.సి.కృష్ణస్వామిరాజుగారు ఈ పకోడి పొట్లాం పుస్తకంలో తను వ్రాసిన 60కార్డు కథలను పొందుపరిచారు. అన్ని కథలూ లోగడ వివిధ ప్రముఖపత్రికల్లో ప్రచురితమైనవే. ఈ కథల గురించి ముందుమాటలో చలపాక ప్రకాష్ గారు " పకోడీ పొట్లం ! మెత్తని పకోడినా..గట్టి పకోడినా.. ఉల్లిపాయ పకోడినా.. మసాలా పకోడినా.. ఆలూ పకోడినా.. ఎలా ఏమి వెతకక్కర్లేదు. అన్ని రకాల రుచులు గుత్తిగా కలిపి ఉన్న 'పకోడి పొట్లాం ; ఇది. ఎక్కువ పకోడి ఉందేం తినలేమని భయపడవలసిన అవసరం లేదు. ఇందులో ఉన్నవి తక్కువ మోతాదులో (తక్కువ నిడివిలో) ఉన్న పకోడినే. గబగబా తినేయవచ్చు, తిన్నవన్ని వెంటనే అరిగించవచ్చు, -నందించవచ్చు" అన్నారు. ఇందులో ప్రతి కథకూ ఈ వాక్యాలు అన్వయిస్తాయి. ఈ 60 కథల్లో అంత వైవిధ్యమూ ఉంది - పిల్లల కథలు, సస్పెన్స్ కథలు, హాస్య కథలు, జానపద కథలు, సందేశాత్మక కథలు.. అన్ని రకాల కథలనూ అతి తక్కువనిడివిలో తీర్చిదిద్దిన రచయిత నేర్పుని అభినందించి తీరాలి.. కథా శీర్షికలు కూడా వినూత్నంగా ఉన్నాయి - కోడి కూత, మిల్క్ బాయ్ - పేపర్ బాయ్, పొంగలి భజన, కలియుగ కుంతి, రత్నం గారి ఛత్రం - ఇలా. సత్కాలక్షేపం కోసం, సదాలోచనల కోసం ఎప్పుడైనా ఎన్నైనా చదువుకోదగ్గ కథలు ఈ 'పకోడి పొట్లాం' కార్డు కథలు.!

★★★